

లకు యవ్వనంలో ఉన్న ఆడపిల్లలను ఆవేశించినప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. నేనిప్పుడు మరో రాజపుత్రికను ఆవేశిస్తాను. నువ్వు అక్కడికి రాకూడదు. వస్తే నిన్ను కూడా తినేస్తాను. జాగ్రత్త!'' అని పలికి అక్కణ్నుంచి వెళ్లిపోయాడు.

బ్రహ్మరాక్షసుడు వదిలిపోగానే.. విరుచుకుపడిపోయిన రాకుమారికి మెల్లిగా మెలకువ వచ్చింది. దుర్గాదత్తుడు చాలా సంతోషించాడు. సానుభూతికి మొదట చెప్పినదానికంటే ఎక్కువ డబ్బిచ్చాడు. అతనికి చక్కని భవంతి కట్టించాడు. మరో బ్రాహ్మణ పుత్రికతో పెళ్లి చేయించి, తన నగరంలోనే కాపురం పెట్టించాడు.

కొంతకాలం ఆనందంగానే గడిచింది. రావిచెట్టు బ్రహ్మరాక్షసుడు వేరొక రాచకన్యను ఆవేశించాడు. ఆ రాజు దుర్గాదత్తునికి స్నేహితుడు. దుర్గాదత్తుని కుమార్తెకు సానుభూతి రాక్షసపీడను వదిలించాడని ఆ రాజు విన్నాడు.

'మీ ఆస్థాన మాంత్రికుణ్ని మా పురానికి పంపించవలసింది' అని వర్తమానం పంపించాడు.

దుర్గాదత్తుడు ఆ ఉత్తరం చదువుకుని, సానుభూతిని పిలిపించాడు. సంగతి సందర్భాలు తెలియచేశాడు.

''మీరే పనిచేస్తే మీ కీర్తి విశ్వవ్యాప్తం కాగలదు'' అన్నాడు.

సానుభూతికి భయం వేసింది.

''మహారాజా! భూతోచ్చాటన సామాన్యం కాదు. నా తపస్సంతా ధారపోసి మీ ఇంటిలో బ్రహ్మరాక్షసుణ్ని విడిపించాను. ఇప్పుడు నా శక్తి సరిపోదు. తెగించి ప్రయత్నిస్తే నేను పరానికి దూరమైపోతాను'' అని చెప్పాడు.

దుర్గాదత్తుడు అంగీకరించలేదు.

''మహామాంత్రికా! ఆ రాజు నాకు మంచిమిత్రుడు, బంధువు కూడా. ఈ ఒక్కసారికీ మీరక్కడికి వెళ్లక తప్పదు. ఇంకెప్పుడూ ఎక్కడికీ పంపించనని మాటిస్తాను. ఇప్పుడు మాత్రం నా మాట దక్కించాలి'' అని బతిమాలుకున్నాడు.

తప్పనిసరై సానుభూతి ఒప్పుకొన్నాడు. అష్టాక్షరి మంత్రాన్ని జపిస్తూ రాకుమారి గదిలో అడుగుపెట్టాడు.

''అయ్యా! నేను రావిచెట్టు బ్రాహ్మణుడిని వచ్చాను'' అన్నాడు.

''ఆ.. నువ్వా?! మళ్లీ వచ్చావా?! ఎందుకొచ్చావ్?! రావద్దని చెప్పలేదూ.. చూడు నిన్నేం చేస్తానో!'' అంటూ మీదికి రాబోయాడు బ్రహ్మరాక్షసుడు.

''అయ్య బాబోయ్.. నా తప్పేం లేదు. మా గయ్యాళి పెళ్లాం వచ్చింది. బయట ఉంది. బండిమీంచి మోకులు దింపుతున్నది. ఈ సంగతి చెప్పి నిన్ను రక్షించాలనే వచ్చాను'' అన్నాడు భయపడుతూ సానుభూతి.

''అమ్మ బాబోయ్... ఆమె వచ్చిందా!?'' అంటూ బ్రహ్మరాక్షసుడు అక్కణ్నుంచి పారిపోబోయాడు.

సానుభూతి అతని చెయ్యి పట్టుకుని ఆపేస్తూ..

''మహానుభావా! నువ్వయితే పారిపోగలవు. మరి నా గతేంటి?! నన్ను కూడా రక్షించు'' అని వేడుకున్నాడు.

''దాన్ని పెళ్లి చేసుకున్నందుకు అనుభవించు. నువ్వెలా పోతే నాకేంటి!?'' అంటూ బ్రహ్మరాక్షసుడు పట్టు విడిపించుకుని సముద్రాలు దాటి పారిపోయాడు. ఆ తరువాత ఆ చుట్టుపక్కల ఎక్కడా వాడి జాడలేదు.

సానుభూతికి ఆ రాజుకూడా వెలకట్టలేని బహుమతులిచ్చాడు. దానితో దేవేంద్ర భోగాలు అనుభవిస్తూ సానుభూతి చాలాకాలం సుఖంగా ఉన్నాడు.

* * *

అంటూ కథను పూర్తిచేసి..

''నువ్వు చెప్పిన కథలోని కోడళ్లమారి అత్తకంటే ఆ గంపగయ్యాళి ఎక్కువ గద్దరి అవునా కాదా!'' అని అడిగాడు పుత్రకుడు. చివరిగా..

''రామజోగీ! ఇంతసేపూ నీతో మాట్లాడటం వల్ల నీపట్ల నాకు గాఢమైన స్నేహభావం కలిగింది. ఒక పని చెయ్యి.. నీ జోలె, ఢక్కా నాకియ్యి. ఆ కోడంద్రమారి దగ్గర్నుంచి నువ్వు ఆశించిన దానికంటే ఎక్కువధనం సంపాదించుకొస్తాను'' అన్నాడు.

రామజోగి అతని మాటలు అంగీకరించాడు. తాను జోలెగా వాడుకుంటున్న పుత్రకుడి బొంతసంచీని అతనికిచ్చాడు. దాంతోపాటు ఢక్క కూడా ఇచ్చాడు. అవి రెండూ తీసుకుని ఊళ్లోకి వెళ్లినట్లు నటించిన పుత్రకుడు.. ఏకాంత ప్రదేశానికి మళ్లాడు. బొంతసంచిపై దండంతో కొట్టాడు. దానినుంచి బంగారునాణేలు రాలాయి. ఆ నాణేలు తీసుకువెళ్లి రామజోగి ముందు పోశాడు.

వాటిని చూసిన రామజోగికి కళ్లు మెరిశాయి.

''కాసేపు ఉండు.. మరో ఇంటికి వెళ్లి, మరికొంచెం సంపాదించుకొస్తా!'' అని పలికాడు పుత్రకుడు.

బంగారు నాణేల మీద ఆశకొద్దీ రామజోగి తలూపాడు. ఈసారి పుత్రకుడు తిరిగిరాలేదు. పాదరక్షలు తొడుక్కుని.. 'నేనిప్పుడు దక్షిణసముద్రానికి పోవాలి' అని తలుచుకున్నాడు.

రామేశ్వరం నుంచి తీర్థయాత్రలు చేయసాగాడు. తన దగ్గరున్న దండం సాయంతో తానే ఒక కొత్తరాజ్యాన్ని నిర్మించుకోవచ్చు. అయితే అటువంటి రాజ్యానికి అనువైన ప్రదేశం ఎక్కడుందో తెలుసుకోవడానికి పుత్రకుడు చాలాకాలం తీర్థయాత్రల్లో గడిపాడు. ఒకనాడు మహాబలిపురంలో ఒక పేదరాలి ఇంటికి వెళ్లాడు.

''అవ్వా! నేనీ పట్టణంలో కొంతకాలం ఉందామనుకుంటున్నాను. మీ ఇంటిలో ఉండనిస్తే నువ్వు కోరినంత ధనమిస్తాను'' అన్నాడు.

అందుకు ఆ పేదరాలు..

''బాబూ! నేను బతికి చెడినదాన్ని. అన్నం అమ్ముకోను. ఈ పూటకు భోజనం పెట్టగలను'' అన్నది.

పుత్రకుడు తింటున్నంతసేపూ అవ్వ తన కథ చెప్పింది. ఆమె భర్త మహాబలిపురం రాజుగారి ఆస్థానంలో పండితుడిగా ఉండేవాడు. ఇటీవలే ఆయన మరణించాడు. పిల్లలు లేకపోవడంతో ఆస్తి దాయాదుల పాలైంది. అయితే ఈమధ్యనే మహారాజు కుమార్తె అయిన పాటలికతో అవ్వకు స్నేహం ఏర్పడింది.

రోజూ తనకో కథ చెబితే అవ్వకు నెలభత్యం ఇచ్చే ఏర్పాటు చేస్తానంది యువరాణి. అవ్వ సంతోషించింది. కానీ, యువరాణి ఎప్పుడూ ఆమె చెప్పే కథలను సరిగా వినదు, పట్టించుకోదు. ఇలాగైతే వస్తున్న నెలభత్యం కూడా పోతుందేమో అని అవ్వకు బెంగగా ఉంది.

..పుత్రకుడు అవ్వలోని బెంగను తెలుసుకున్నాడు.

''అవ్వా! నేను నీకు కన్నెపిల్లలకు నచ్చే కథలు చెప్పగలను. వాటిని ఆమెకు చెప్పి, నువ్వు పొట్ట పోషించుకోవచ్చు'' అన్నాడు పుత్రకుడు.

అందుకు అవ్వ..

''నీతి బాహ్యమైనవి కాకపోతే సరే..'' అన్నది.

ఆనాటినుంచి పుత్రకుడు రోజుకో కథ అవ్వకు చెబుతూ ఉండేవాడు. వాటిని యథాతథంగా అవ్వ అంతఃపురంలో పాటలికకు చెబుతుండేది. క్రమంగా అవ్వ చెప్పే కథలమీద పాటలికకు మోజు పెరిగింది. రోజూ ఆ కథల కోసం ఎదురు చూడసాగింది.

యువరాణి తాను చెప్పే కథల్ని చెవులప్పగించి వింటున్నదని విన్న పుత్రకుని మనసు ఊరికే ఉండలేకపోయింది. ఒకనాడు రాత్రి ఎవరూ చూడకుండా పాదరక్షల సాయంతో అంతఃపురానికి రహస్యంగా వెళ్లాడు. తల్పంపై శయనించి ఉన్న పాటలికను చేరాడు. ఆమె మెడకు గంధంపూసి, తాంబూల రసంతో చెక్కిలిపై బొమ్మలు గీశాడు. ఇంకా ఆమె ఆదమరుపు నిద్రలో ఉండగానే అక్కణ్నుంచి వచ్చేశాడు.

మరునాడు ఆ సన్నివేశాన్నే కథగా మలిచి అవ్వకు చెప్పాడు. గతరాత్రి తనకు కలిగిన అనుభవాన్నే కథగా చెప్పడంతో తొలిసారి అవ్వను నిలదీసింది పాటలిక.

''ప్రతిరోజూ నీకీ కథలన్నీ ఎవరు చెబుతున్నారు?'' అని గట్టిగా అడిగింది.

ముసలమ్మకు రహస్యం చెప్పక తప్పలేదు. మరునాడు అవ్వతోపాటే పుత్రకుడు కూడా వచ్చాడు. పాటలిక తొలిచూపులోనే పుత్రకుణ్ని వలచింది. కొంతకాలం వాళ్లిద్దరూ రహస్యంగా కలుసుకోసాగారు. ఫలితంగా పాటలిక గర్భవతి అయింది.

అంతఃపుర రహస్యం బట్టబయలయ్యే రోజు రానే వచ్చింది. పాటలిక గర్భవతి అయిందనే వార్త తెలిసిన మహారాజు మండిపడ్డాడు. ద్రోహి ఎవడో కనిపెట్టి వధించమని కొందరిని నియమించాడు. ఆ వార్త తెలిసిన పాటలికకు ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ పుత్రకుడితో పెళ్లికి తన తండ్రి ఒప్పుకోడని అనిపించింది.

దాంతో ఒకనాటి రాత్రి పాదుకలను ధరించి, పాటలికను గట్టిగా పట్టుకుని.. తాను గంగాతీరంలో ఒక సుందరమైన ప్రాంతానికి వెళ్లాలని కోరుకున్నాడు పుత్రకుడు. ఆ ప్రదేశం వాళ్లిద్దరికీ బాగా నచ్చింది.

దండం రెండోకొనను నేలపై రాయగానే అక్కడో అద్భుతమైన పట్టణం పుట్టింది. బొంతసంచీ నుంచి నాణేలు రాల్చి ధనరాశులు పోగుచేశాడు పుత్రకుడు. తన పేరు, భార్యపేరు కలిసి వచ్చేలా ఆ నగరానికి 'పాటలీపుత్రం' అని పేరుపెట్టి.. చిరకాలం ఆనందంగా జీవించాడు. గంగ, గండక, పుత్ర నదుల సంగమస్థానంలోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సువిశాలమైన మగధ సామ్రాజ్యం విలసిల్లింది.

**(వచ్చేవారం.. కల నిజమాయెనా..)**